క్లుప్తంగా

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


తేనెబండలో ప్రచారం చేస్తున్న శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పలు డివిజన్లలో సుడిగాలి పర్యటన చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డికి పట్టభద్రులు, ఉద్యోగులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, సచివాలయ నగర కన్వీనర్లు రాంగణేష్, కోలా కిరణ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

యాదమరి: మండలంలోని మాదిరెడ్డి పల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం పాఠశాలలో విధులు నిర్వహించే మహిళ ఉపాధ్యాయులకు శాలువ కప్పి, స్వీట్‌లు పంచి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు చంద్రమోహన్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


కమ్మపల్లెలో టీకాలు వేస్తున్న పశువైద్యులు

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి టీకాలు పశువులకు వేయించాలని వైద్యాధికారి అమరనాథ్ రెడ్డి కోరారు. మండలంలోని కమ్మపల్లెలో గురువారం 155 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వేసవిలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. చాల మంది రైతులు ఈ టీకాలు వేసుకుంటు పాల దిగుబడి తగ్గిపోతుందని అపోహ పడుతుంటారని, అలాంటిదేమీ ఉండదని చెప్పారు.

పేదల ముంగిట్లో వైద్య సేవలు


పేరయ్యగారిపల్లెలో వైద్య బృందం

ఐరాల: గ్రామీణుల ముంగిట్లో వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో గురువారం 104 వైద్య శిబిరం నిర్వహించి, 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యువకులపై హత్యాయత్నం


చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని చర్చి వీధిలో ఇద్దరు యువకులపై గురువారం రాత్రి హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో రామ్‌నగర్ కాలనీకి చెందిన మణికంఠ ప్రదీప్ (30), వినోద్ (31) తీవ్రంగా గాయపడ్డారు. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. చర్చి వీధిలో ఎలక్ట్రికల్ దుకాణం నడుపుతున్న మణికంఠ ప్రదీప్‌కు, సంతపేటకు చెందిన ఆనంద్ బాబుకు గతంలో కుటుంబ తగాదాలున్నాయి. ఇటీవల ఆనంద్‌బాబుపై ప్రదీప్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అతడ్ని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనిపై కక్షగట్టిన ఆనంద్ మద్యం సేవించి, అతని స్నేహితుడు సాయితో కలిసి చర్చి వీధిలోని ఎలక్ట్రికల్ దుకాణంలో ఉన్న ప్రదీప్ వద్దకు వెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తేవా అంటూ చాకుతో శరీరంపై పలుచోట్ల కోసేశాడు. దుకాణంలో ఉన్న వినోద్ అడ్డురావడంతో అతనిపై కూడా దాడిచేశారు. అనంతరం బాధితులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా అక్కడకు వెళ్లిన ఆనంద్‌బాబు అందరూ చూస్తుండగానే మళ్లీ ప్రదీప్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడిచేసి పారిపోయాడు. గాయపడ్డ ఇద్దరు బాధితులకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కొద్దిసేపటి తరువాత ఆనంద్‌బాబు తన చేతిని కోసుకుని రోడ్డుపై వెళుతుండగా పోలీసుల్ని అతడిని అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాసులు కురిపిస్తున్న 'డ్రాగన్'

ఇప్పటివరకు జిల్లాలో ఉద్యానవన పంటల్లో మామిడి అగ్రస్థానాన్ని ఆక్రమించింది. అయితే ఏటా మామిడి దిగుబడిలో ఒడిదుడుకులకు లోనవుతూ గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే ఉంది. దీంతో పలువురు రైతులు పంట మార్పిడిపై ఆసక్తి చూపుతున్నారు. అందులో చిత్తూరు రూరల్ మండలం పరిధిలోని ఓ రైతు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. ఈ పంట సాగు వల్ల మంచి దిగుబడితో పాటు ఆదాయాన్ని పొందుతున్నారు.

- సాగుపై మక్కువ చూపుతున్న రైతులు
- ఎకరాకు రూ.లక్ష మేరకు ఆదాయం


చిత్తూరు మండలం కొత్తూరులో సాగవుతున్న డ్రాగన్ ఫ్రూట్ పంట

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు రూరల్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బాబు రెండేళ్లుగా డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేస్తున్నారు. బెంగళూరులోని దేవనహల్లి నుంచి డ్రాగన్ ఫ్రూట్ విత్తన తీగలను తీసుకువచ్చి ఎకరా విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గత ఏడాది మొదటి పంటగా టన్ను మేరకు డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి వచ్చింది. నాణ్యతను బట్టి కిలో రూ. 100 నుంచి రూ.200 మేరకు విక్రయించారు. ఒకసారి పంటను వేసుకుంటే దాదాపు 20 ఏళ్లపాటు సాగు చేసుకునే వెసులుబాటు ఉంది. ప్రతి ఏటా పంట దిగుబడి అంతకంత పెరిగి మరింత ఆదాయం వస్తుందని రైతు చెబుతున్నారు. పంట వేసే సమయంలో ఎకరా విస్తీర్ణానికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. తరువాత ఏటా పంట సాగులో యాజమాన్యానికి, ఎరువులకు దాదాపు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చవుతుంది. పంట దిగుబడి మాత్రం మొదటి ఏడాది 500 కిలోల నుంచి ఒక టన్ను మేరకు మాత్రమే దిగుబడి వస్తుంది. రెండో ఏడాది 1.50 టన్నులు, మూడో ఏడాది 2 టన్నుల మేరకు దిగుబడి వస్తుంది. ఈ విధంగా యాజమాన్య పద్ధతులు క్రమం తప్పకుండా పాటిస్తే దాదాపు 20 ఏళ్ల పాటు పంటను సాగు చేసుకోవచ్చు.

పంట సాగు ఇలా...

డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుకు అవసరమైన రాతి స్తంభాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలి. 12కు 6 అడుగుల చొప్పున నాటుకుంటే ఎకరాకు 2400 స్తంభాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రతి స్తంభం చుట్టూ నాలుగువైపులా విత్తన తీగలను నాటుకోవాలి. ఈ విధంగా నాటుకున్న తీగల నుంచి వచ్చిన మొలక తీగలను రాతి స్తంభాలకు అల్లించుకోవాలి. ప్రతి స్తంభానికి పైన టైరు లేదా, కమ్మిని పందిరి లాగ అల్లించుకోవాలి. దీంతో తీగలు స్తంభాల మీదుగా పైకిపోయి కమ్మీలపై పందిరిలా ఏర్పడుతుంది. మొదటి రెండేళ్లలో స్తంభాల మేరకు మాత్రమే తీగలు అల్లుకుంటాయి. తరువాత కాలం గడిచే కొద్దీ పందిరిలాగా మొత్తం తీగలు అల్లుకుంటాయి. పంట సాగులో ఎప్పటికప్పుడు కలుపు తీసి వేయాలి. దుక్కులు దున్నడంతోపాటు, అవసరమైన మేరకు ఎరువులు వేయాలి. రెండు వారాలకోసారి సాగు నీరు అందించినా పంటకు సరిపోతుంది. ఈ పంట సాగుకు ప్రభుత్వం రాయితీపై బిందు సేద్యం పరికరాలను కూడా ఏర్పాటు చేస్తుంది. పంట ప్రతి ఏటా జూన్‌లో మొగ్గ వేసి నవంబరు నెలాఖరుకల్లా డ్రాగన్ ఫ్రూట్స్ దిగుబడి వస్తుంది.

మార్కెటింగ్ ఇలా..

దిగుబడి అయిన డ్రాగన్ ఫ్రూట్స్‌ను నాణ్యతను బట్టి పండ్ల దుకాణాల నుంచి సూపర్ మార్కెట్లకు విక్రయించుకోవచ్చు. బెంగళూరు నగరంలో ఈ డ్రాగన్ ఫ్రూట్స్‌కు మంచి డిమాండ్ ఉంది. ఈ రైతుకు గత ఏడాది మొదటగా 500 కిలోల మేరకు దిగుబడి వచ్చింది. దీంతో చిత్తూరు నగరంలోనే వాటిని కిలో రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయించి దాదాపు 60 వేల వరకు ఆదాయాన్ని పొందారు. ఈ ఏడాది మరింత ఆదాయం వస్తుందని రైతు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ పంట దిగుబడి తరువాత విత్తన తీగలు కూడా సేకరించి రైతులకు విక్రయించుకోవచ్చు. ఈ ప్రక్రియ వల్ల రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుంది. దీంతో సమీప గ్రామాల రైతులు ఇక్కడి డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించి వెళుతున్నారు.

పంట మార్పిడి



ఉద్యాన పంటల్లో కొత్త రకాల పంటల మార్పిడికి రైతులు ముందుకు రావాలి. అత్యధికంగా మామిడి పంటనే సాగు చేయడం వల్ల అనుకున్న మేరకు ఆదాయాన్ని పొందలేక పోతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయడం వల్ల ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా పొందవచ్చు. ఒకసారి పెట్టుబడి పెడితే దాదాపు 20 ఏళ్లపాటు ఆదాయాన్ని పొందవచ్చు. ప్రతి ఏటా కలుపులు తీయడం, ఎరువు వేసుకుని నెలకు రెండు తడులు నీటిని అందిస్తే చాలు. బిందు సేద్యం ఏర్పాటు చేసుకుంటే సాగు నీటిని మరింత పొదుపు చేసుకోవచ్చు. – బాబు, రైతు, కొత్తూరు

ఆరోగ్యకరం

డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు. శరీరంలో రక్త శాతం పెరగడంతో పాటు, జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా దీన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. గాంధీవిగ్రహం వద్ద వారు గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ స్కూల్ స్వీపర్ల సంఘం అధ్యక్షురాలు జయకుమారి పిలుపునిచ్చారు.

నర్సరీలపై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అటవీశాఖ నర్సరీలో పెంచే మొక్కలపై విశ్రాంత డీఎఫ్‌ఓలు లక్ష్మీకాంతం, సైదీమీర్ అవగాహన కల్పించారు. స్థానిక అటవీశాఖ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. నర్సరీ నిర్వహణలో మెలకువలు, ప్రణాళిక అంశాలపై తెలియజేశారు. జూన్ నుంచి జిల్లాలోని 15 నర్సరీల్లో ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వరసిద్ధుని ఆదాయం రూ.42 లక్షలు


విరాళం చెక్కు ఇస్తున్న దాత చౌడేశ్వరి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి వివిధ టెండర్ల ద్వారా రూ.42.14 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. గురువారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో స్వామివారికి సంబంధించిన భవనాలు, దుకాణాలను సంవత్సర కాలానికి పలు టెండర్లు నిర్వహించారు. వీటిలో టెండర్ దారులు లైసెన్స్ పొందారు. ఆలయ పాలకమండలి సమావేశం ఈ నెల 25న శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.

రూ.2.5 లక్షల విరాళం

అనంతపురానికి చెందిన దాత చౌడేశ్వరి రూ.2.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఇందులో నిత్యాన్నదానానికి రూ.లక్ష, గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.5 లక్షలు విరాళాన్ని ఈఓ వెంకటేశుకు అందించారు.

ఉన్నత పాఠశాల వార్షికోత్సవం


బహుమతులందుకున్న విద్యార్థులతో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం వేడుకగా నిర్వహించారు. దీనికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు హాజరయ్యారు. ఉదయం పాఠశాల ఆవరణలో సరస్వతీ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, స్థానిక ఎంపీటీసీ దుర్వాసులు, సర్పంచ్ రాధమురళి, ఎంఈఓ రుక్మిణీ, పాఠశాల హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్..

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయించడానికి ప్రయత్నించిన ఇద్దరు నిందితులను చిత్తూరు టూటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. నగరంలోని ఇందిరా నగర్‌లో కారులో మద్యం ఉంచి విక్రయిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసమూర్తికి సమాచారం అందింది. డీఎస్పీ ఆదేశాలతో సీఐ మద్దయ్య ఆచారి తన బృందంతో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఖాదర్‌మిరాన్‌వీధికి చెందిన ఎస్.మోహన్ అనే సంతోష్ (26)ను అరెస్టు చేసి కారుతో పాటు అందులో ఉన్న రూ.40 వేల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే రాజుగుడి సమీపంలో మద్యం విక్రయిస్తున్న ఎస్.సుబ్రమణ్యం (32) అనే వ్యక్తిని అరెస్టు చేసి రూ.10 వేలు విలువ చేసే కర్ణాటక మద్యం సీజ్‌చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ మల్లికార్జునతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్య సంపదను వినియోగించుకోండి


మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలోని చేపల వ్యాపారులు ప్రధానమంత్రి మత్స్య సంపద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ అరుణ కోరారు. నగరపాలక కార్యాలయంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఫిష్ ఆంధ్ర – ఫిట్ ఆంధ్ర కార్యక్రమాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, మత్స్యకారులు, వ్యాపారుల ఆర్థికంగా పురోభివృద్ధి సాధించడం, ఆరోగ్యకరమైన చేపలను ప్రజలకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. అందులో భాగంగా ప్రధానమంత్రి మత్స్య యోజన, ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర కార్యక్రమాల ద్వారా మినీ ఫిష్ రిటైల్ అవుట్లెట్లు, లైవ్ ఫిష్ విక్రయ కేంద్రాలు, రెస్టారెంట్లు, ఫిష్ హబ్ ఏర్పాట్ల కోసం యూనిట్లను మంజూరు చేస్తుందన్నారు. రాయితీతో కూడిన యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్న యూనిట్లు, రాయితీ వివరాలను మత్స్య శాఖ డీడీ రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ లోకేష్, సీఎంఎం గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, చేపల వ్యాపారులు పాల్గొన్నారు.

స్పందన వినతుల పరిశీలన

పూతలపట్టు: మండలంలోని బోడిరెడ్డికండ్రిగ గ్రామంలో స్పందనకు వచ్చిన వినతులపై ఎంపీడీఓ గౌరి గురువారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. గ్రామంలోని బోరు సమస్యను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం శ్మశాన వాటిక కోసం భూమిని పరిశీలించారు. జగనన్న కాలనీల్లో ఇళ్లను లబ్ధిదారులు పూర్తి చేయాలని తెలిపారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

మనిషికి ఫిట్‌నెస్ అవసరం


క్లినిక్ ప్రారంభిస్తున్న కుమరెంద్ర చౌదరి

చిత్తూరు రూరల్: మనిషికి చదువుతోపాటు ఫిట్‌నెస్ ఎంతో అవసరం అని సీనియర్ ఆడిటర్ కుమరెంద్ర చౌదరి అన్నారు. నగరంలోని గురునగర్ కాలనీలో రామలక్ష్మి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో నడపనున్న డాక్టర్ రామలక్ష్మి అస్థెటిక్ క్లినిక్‌ను కుమరెంద్ర చౌదరి ఆయన సతీమణి డాక్టర్ మమత ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, క్లినిక్ నిర్వాహకులు, రోజప్రియ, నిరంజన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

పూతలపట్టు: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. అయన గురువారం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించాలన్నారు. వేము ఇంజినీరింగ్ కళాశాలలోని అధ్యాపకులతో మాట్లాడారు. తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, అమరనాథరెడ్డి, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

పట్టభద్రులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల సీనియర్ నాయకులు, పెనుగొండ అబ్జర్వర్ తలపులపల్లి బాబురెడ్డి తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.

సమష్టి కృషి అవసరం

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టి కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండల నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తగ్గువారిపల్లె పంచాయతీలో విస్తృతంగా ప్రచారం చేశారు. మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో, ఏఎంసీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, నారేసోమశేఖర్, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, బీసీ నాయకుడు దొరస్వామి పాల్గొన్నారు.

జగనన్నకు కానుకగా ఇద్దాం

ఐరాల: పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. కాణిపాకంలోని ఒక ప్రైవేటు కల్యాణమండపంలో పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. పుత్రమద్దిలో మండల పార్టీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి ప్రచారం చేశారు.

బయట ఉన్న ఓటర్లను పిలిపించాలి

తవణంపల్లె: పట్టభద్రుల ఓటర్లు దూరప్రాంతాల్లో ఎక్కడ ఉన్నా పిలిపించి ఓటు వేయించాలని


పూతలపట్టు: పట్టభద్రులకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

ఎమ్మెల్యే బాబు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ మండల కన్వీనర్ పట్నం సిద్ధంపల్లె హరిరెడ్డి, వైఎస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

గుడిపాల: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య తెలిపారు. మండలంలోని గుడిపాల, భట్టువాళ్లూరు, గుడిపాల అరుంధతివాడల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రజినీకాంత్, రవీంద్రారెడ్డి, శిలంబరసన్, సాయి, సాయిప్రతాప్, రజినీ, సురేంద్రారెడ్డి, రఘు, ధరణి పాల్గొన్నారు.

యాదమరి: ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ బాబు కోరారు. వారు మండలంలోని తెల్లరాళ్లపల్లె, 155 కమ్మపల్లె, బోధగుట్టపల్లె, పత్రపల్లె, సిద్దారెడ్డి పల్లె, భూమిరెడ్డి పల్లె, ఓటివారిపల్లె, కాశిరాళ్ల గ్రామాలో ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కబీర్, రవీంద్రబాబు, మనోహర్ రెడ్డి, భజలింగం, దుర్వాసుల నాయుడు పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లెలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు, గుడిపాల: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య

నేడు ఫ్యామిలీ ఫిజీషియన్

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సుకన్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

పిల్లలకు బిస్కెట్ల పంపిణీ

తవణంపల్లె: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఉన్న దివ్యాంగుల పిల్లలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన గురువారం భవిత సెంటర్‌ను సందర్శించారు. పిల్లలకు బిస్కెట్లు అందజేసి, వారితో కాసేపు ముచ్చటించారు.

కిడ్నీ దినోత్సవం

చిత్తూరు రూరల్: నగరంలోని ప్రైవేటు కళాశాలలో గురువారం అపోలో డయాలసిస్ క్లినిక్ ఆధ్వర్యంలో కిడ్నీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కిడ్నీ ప్రయోజనాలు, వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. క్లినిక్ సిబ్బంది ముఖేష్, కిషోర్‌రెడ్డి, సాయిక్రిష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి


పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న సీఐ, తహసీల్దార్లు

గుడిపాల: ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. వారు గురువారం నరహరిపేట జెడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

ఉచితంగా కంటి పరీక్షలు

తవణంపల్లె: మండల కేంద్రంలోని చర్చిలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య నిపుణులు 80 మందికి పరీక్షలు చేశారు. చెన్నైకి చెందిన ఎంఎన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో జీసెస్ గాస్పెల్ ప్రేయర్ మినిస్ట్రీ ట్రస్టు ఆధ్వర్యంలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 28 మందిని ఉచిత కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేసి చెన్నై ఎంఎన్ కంటి ఆస్పత్రికి తరలించారు.

తల్లీబిడ్డల ఆరోగ్యమే ధ్యేయం

ఐరాల: తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్రమం తప్పకుండా గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ సుగుణవతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఆహార భద్రత చట్టం ప్రకారం తినుబండారాల తయారీ, హోటళ్లు, దుకాణదారులు నిబంధనలు పాటించాలని ఆహార కల్తీ నియంత్రణ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కంట్రోలర్ శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. సంవత్సర టర్నోవర్ రూ.12 లక్షల్లోపు గల దుకాణదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆపై ఉన్నవారు లైసెన్సులు తీసుకోవాలన్నారు. ఏటా నిర్ణీత గడువులోపు వాటిని పునరుద్ధరించుకోవాలని సూచించారు. తనిఖీల్లో సేకరించిన ఆహార నమూనాలు సబ్‌స్టాండర్డ్, మిస్‌బ్రాండ్ కింద కేసులు జేసీ కోర్టులో నమోదు చేస్తామన్నారు. హానికరమైనది(అన్ సేఫ్)గా నిర్ధారణయితే జరిమానా, జైలు శిక్ష ఉంటుందని వివరించారు.

ఇళ్లు నిర్మించుకోండి

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీలో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని నగర కమిషనర్ అరుణ చెప్పారు. గురువారం నగరపాలక పరిధిలోని 26వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్పందన వినతుల పరిష్కారం, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం వార్డు పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పక్కా గృహాలు నిర్మించుకోవాలని, ప్రభుత్వం అందించే సొమ్ముకు అదనంగా డ్వాక్రా సంఘాల నుంచి రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు.

మలేరియాను కట్టడి చేయండి


ఆరిమాకులపల్లెలో పర్యటిస్తున్న త్యాగరాజు

యాదమరి: గ్రామాల్లో మలేరియా కేసులు అరికట్టాలని కడప జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు కోరారు. గురువారం ఆయన మండలంలోని ఆరిమాకులపల్లెలో పర్యటించారు. గతంలో ఇదే గ్రామంలో మలేరియా కేసు వచ్చిందని, మళ్లీ ఎవరికైనా సోకిందా అని ఆరా తీశారు. అనంతరం యాదమరి ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యులు సురేఖ, అనిల్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.